

వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో

**అంచనాలు తారుమారు**

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 283 శనివారం 7 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

# ఏం చేశారని ఓట్లడుగుతున్నారు?



## బీజేపీ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్న

**మోడీ మూడుసార్లు ప్రధాని అయినా స్మార్ట్‌సిటీ కాలేదు**

**గల్లీలో మోరీ తీసేందుకు ఢిల్లీ నుంచి మోడీ రావాలా..!**

**బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓట్లేస్తే మూసీలో వేసినట్టే..**

**కేసీఆర్‌ను అరెస్టు నుంచి కాపాడుతుంది కిషన్‌రెడ్డే**

**నిజామాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**




**నిజామాబాద్‌ఫిబ్రవరి6(జర్నలిస్ట్ వార్త):** 'బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి. మూడుసార్లు మోడీ ప్రధాని అయినా నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీ చేయలేకపోయారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా మెట్రో విస్తరణకు, ఔటర్ రింగురోడ్డు విస్తరణకు, మూసీ ప్రక్షాళనకు కేంద్రం నుంచి నిధులు తీసుకు రాకుండా అడ్డుకుంటున్నారు. ఏం తెచ్చారని, ఇచ్చారని ఓట్లు అడుగుతున్నారు.' మిగతాది 2లో...

# బీజేపీ మేనిఫెస్టో విడుదల

**తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా**

**బీజేపీ గెలిస్తే పెండింగ్ పనుల్లో వెసులుబాటు కల్పిస్తామన్న రామచందర్ రావు**

**యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామని హామీ**



**హైదరాబాద్,ఫిబ్రవరి6(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. భాజపా విజయం సాధిస్తే పెండింగ్‌లో ఉన్న పన్నుల్లో వెసులుబాటు కల్పిస్తామని, మోడ్రన్ మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తామన్నారు. అవినీతి రహిత మున్సిపాలిటీలే తమ లక్ష్యమని.. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కబ్జాలపై ఉక్కు పాదం మోపడంతో పాటు యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా కమలం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను అధికారికంగా విడుదల చేశారు.ప్రధాన అంశాల్లో కోతులు, కుక్కల బెడద నివారణను చేర్చారు. మిగతాది 2లో...



# స్తంభించిన పార్లమెంట్

**లోక్‌సభలో స్పీకర్ తీరుపై ప్రతిపక్షాల ఆగ్రహం**

**ఉభయ సభల్లో అంతరాయం..**

**సోమవారానికి వాయిదా**

న్యూఢిల్లీ

మోడీ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళనతో పార్లమెంట్ శుక్రవారం స్తంభించింది. ఉభయ సభల్లో వరుసగా ఐదో రోజు అంతరాయం కలిగింది. 2లో...




# రుణ గ్రహీతలకు ఊరట..

## కీలక వడ్డీ రేట్లు యథాతథం

**రెపో రేటును యథాతథంగా ఉంచిన ఆర్బీఐ**

**5.25 శాతంగా కొనసాగనున్న వడ్డీ రేటు**

**ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్న ద్రవ్య పరపతి కమిటీ**

**ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని వెల్లడి**

**'న్యూట్రల్' విధానానికే కట్టుబడిన రిజర్వ్ బ్యాంక్**



# మున్సిపల్ ఎన్నికల్లో రెండు పార్టీలకూ బుద్ధి చెప్పాలి



**కుల, మతాల పేరుతో ఓట్లు దండుకుంటున్న బీజేపీ**

**హామీలు అమలు చేయని మోసకారి కాంగ్రెస్**

**వేములవాడలో ఎన్నికల ప్రచారసభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**వేములవాడఫిబ్రవరి6(జర్నలిస్ట్ వార్త):** కులం, మతం పేరుతో ఓట్లు అడుగుతున్న బీజేపీ, హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో శుక్రవారం మిగతా 2లో...

# పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు డెడ్‌లైన్

**మరో మూడు వారాల సమయం**

**అప్పటికీ నిర్ణయం తీసుకోకపోతే కోర్టు ధిక్కార చర్యలపై ఆలోచిస్తాం**

**స్పష్టం చేసిన సర్వోన్నత న్యాయస్థానం**



**న్యూఢిల్లీఫిబ్రవరి6(జర్నలిస్ట్ వార్త):** పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల అంశంలో నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు స్పీకర్‌కు మరో మూడు వారాల సమయం ఇచ్చింది. అప్పటికీ నిర్ణయం తీసుకోకపోతే కోర్టు ధిక్కార చర్యలపై ఆలోచన చేస్తామని హెచ్చరించింది. బీఆర్ఎస్ బీ ఫారం నుంచి కారు గుర్తుపై గెలిచిన శాసన సభ్యులు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి మిగతాది 2లో...

# విశ్వవిజేత భారత్...

## అండర్19 క్రికెట్‌వరల్డ్ కప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై గ్రాండ్ విక్టరీ

**కేవలం 80 బంతుల్లో 175 పరుగులతో విధ్వంసం సృష్టించిన వైభవ్ సూర్యవంశీ**

**భారీ లక్ష్యఛేదనలో ఫల్కనర్ (115) సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా ఇంగ్లండ్‌కు తప్పని ఓటమి**

**టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శనతో అపజయం ఎరుగకుండా టైటిల్ నెగ్గిన టీమిండియా**

**ఢిల్లీ ఫిబ్రవరి6(జర్నలిస్ట్ వార్త):** అండర్-19 క్రికెట్‌లో భారత యువ జట్టు మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. హరారే వేదికగా జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా రికార్డుస్థాయిలో ఆరోసారి అండర్-19 ప్రపంచకప్‌ను ముద్దాడి చరిత్ర సృష్టించింది మిగతాది 2లో...



# మనకెందుకులే అనుకోవద్దు...

## ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది: పవన్ కల్యాణ్

**హిందూ ధర్మంపై దాడులు జరిగినప్పుడు మౌనం వీడాలని పవన్ పిలుపు**

**కేవలం భక్తులుగా కాకుండా ధర్మ సంరక్షకులుగా ఉండాలన్న డిప్యూటీ సీఎం**

**కులం, ప్రాంతం వేరైనా మన ధర్మం ఒక్కటేనని వ్యాఖ్య**

**మన విశ్వాసాలను కాపాడుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ**



# ఏం చేశారని ఓట్లడుగుతున్నారు?

(మొదటి పేజీ తరువాయి)

అని కేంద్ర మంత్రులను, బీజేపీ ఎంపీలను, బీజేపీ నేతలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నిం చారు. 'మున్సిపల్ మంత్రిగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ఏడు మున్సిపాల్టీల అభివృద్ధికి రూ.1045 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నాం.

పదేండ్లు బీఆర్ఎస్‌కు, పన్నెండేండ్లు బీజేపీకి అధికారం ఇచ్చినా.. మున్సిపాల్టీలు మురికి కూపంగానే ఉన్నాయి. గల్లీల్లో మోరీలు తీయాలంటే ఢిల్లీ నుంచి మోడీని పిలవాలా..? 'గాడిదకు గడ్డి వేసి ఆవు నుంచి పాలు పిండటం సబబా? బీఆర్ఎస్, బీజేపీకి ఓట్లు వేసి అభివృద్ధి పనులు కాంగ్రెస్ చేయాలంటే సాధ్యమా..? ఇప్పుడు మంచి అవకాశం వచ్చింది. స్థానికంగా మనోడే ఉండాలే. నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాల్టీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మోడీ వద్ద పరపతి ఉందని చెప్పుకునే ఎంపీ అరవింద్ నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ఎంపిక చేయలేదని ప్రశ్నించారు. ఆయన వద్ద పరపతి లేదని అర్థమవుతోందని అన్నారు. నిజామాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డుకు నిధులిస్తే తాము వద్దన్నామా..? అని ప్రశ్నించారు.

నిజామాబాద్ జిల్లాకు మంజూరైన మూడు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు, తెలంగాణ యూనివర్సిటీలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రు లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం బర్దిపూర్ శివారులో రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 'ప్రజాపాలన–ప్రగతిబాట' బహిరంగసభలో ప్రసంగించారు. నిజామాబాద్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉందని.. ఖిల్లా జైలు గోడల మీద దాశరథి 'నా తెలంగాణ కోట రతనాల వీణ' అని నినదించారని, ఇక్కడి రైతులు పోరాట పటిమ



గలిగిన వారని, చైతన్యవంతులని, జిల్లా రైతుల వ్యవసాయం దేశానికే ఆదర్శమని అన్నారు. ఇక్కడి రైతుల పక్షాన పోరాటం చేయడంతో కాంగ్రెస్ అధిష్టానం దృష్టిలో పడి సీఎం అయ్యానని, తన మనసులో నిజామాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉన్నట్టు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాకు అత్యధిక నిధులు మంజూరు చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తానని తెలిపారు.

కాంగ్రెస్ హయాంలో కట్టిన ఎస్సారెస్పీ ఇప్పటికీ ధృడంగా ఉండి పంటలకు నీరందిస్తోందని, కానీ గోదావరి జలాల పేరుతో తెలంగాణను కొల్లగొట్టారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'కేసీఆర్, హరీశ్‌రావును జైలులో పెట్టి చిప్పకూడు తినిపించాలని ధర్మపురి అర్వింద్ అంటుంటారని, కాళేశ్వరం బీఆర్ఎస్ పార్టీకి ఏటీఎంగా మారిందని, సీబీఐకి కేసు అప్పగిస్తే 48 గంటల్లో కేసీఆర్‌ను అరెస్టు చేస్తామని పలికిన కిషన్‌రెడ్డి ఎక్కడ దాక్కున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. సీబీఐకి ఇచ్చి ఆరు నెలలవుతున్నా అరెస్టు చేయనీయకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని అడిగారు. ఈ విషయంలో ధర్మపురి అర్వింద్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. శాసనసభలో చర్చ పెట్టి కాళేశ్వరాన్ని సీబీఐకి ఇచ్చాండఇప్పటి వరకు సీబీఐ పట్టించుకోలేదన్నారు. కిషన్‌రెడ్డి కేసీఆర్‌ను ఏ రకంగా కాపాడుతున్నాడో తెలియడం లేదా..? అని అన్నారు.

'నీ పక్కన కూసున్న కిషన్‌రెడ్డి కేసీఆర్‌ను కాపాడుతున్నాడు. అసలు ఎందుకు కాపాడుతున్నాడో అడుగు. కల్వకుంట్ల కిషన్‌రావు అయ్యాడు. కేసీఆర్‌కు దొంగపుత్రుడు కేటీఆర్ ఉంటే.. దత్తపుత్రుడు 'కిషన్‌రావు' అని ఆయనను జనజీవన స్రవంతిలోకి తీసుకురావాలి' అని సీఎం రామచంద్రారావుకు సూచించారు. 70 వేల ఉద్యోగాలు కల్పించామని, ఎల్‌బీ స్టేడియానికి వస్తే 70 వేల తలలు లెక్కపెట్టుకోవచ్చని హితవు పలికారు. గ్రూప్–1పై హైకోర్టు తీర్పు బీఆర్ఎస్‌కు చెంపపెట్టని అన్నారు. 562 మందికి నియామకపత్రాలు అందజేస్తామని తెలిపారు. మున్సిపాల్టీ ల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని అన్నారు. 2029లో సీఎంగా నేను, పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీని మళ్లీ అధికారంలోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు.

రేవంత్‌రెడ్డి మాదిగ.. రేవంతుద్దీన్.. అన్నా స్వీకరిస్తా

'బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నన్ను రేవంతుద్దీన్ అని సంభోదించారు. సంతోషమే. బ్రిటీష్ కాలం పరిపాలన అనంతరం వందేండ్ల తర్వాత దేశంలో ఏ రాష్ట్రం చేయలేని విధంగా కులగణన చేపట్టి బీసీ జనాభా లెక్కలు తీస్తే టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ నన్ను రేవంత్‌గౌడ్‌గా అభివర్ణిస్తే స్వీకరించా. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 100 రోజుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేపట్టి 40 ఏండ్ల సమస్యను పరిష్కరిస్తే.. మంత్రి దామోదర రాజనర్సింహ రేవంత్ మాదిగ అని పిలిస్తే సంతోషమనిపించింది.

30 ఏండ్లుగా కార్యకర్తగా పనిచేసిన వాకటి శ్రీహరికి ఎమ్మెల్యే, మంత్రి పదవి అప్పగిస్తే రేవంత్ ముదిరాజ్ అన్నారు. అనిల్‌కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు పంపితే నన్ను రేవంత్ యాదవ్ అంటూ అక్కున చేర్చుకున్నారు. స్వర్ణ దేవాలయాన్ని నిర్మిస్తానన్నందుకు నన్ను సర్దార్ రేవంత్‌సింగ్ అని సిక్కు సోదరులు పిలిచారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌లు కల్పించాం. సీటు త్యాగం చేసి ఓడి పోయిన షబ్బీర్‌అలీకి పదవి ఇచ్చా. అజారుద్దీన్‌ను మంత్రిని చేశా. కాబట్టి రేవంతుద్దీన్ అని పిలిచినా పర్వాలేదు. కులాలను, మతాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తున్నా' అని సీఎం వ్యాఖ్యానించారు.

# పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు డెడ్‌లైన్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ఫిరాయించారని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ సుప్రీంకోర్టులో గతేడాది జనవరి 15న స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. అదేరోజు ఎమ్మెల్యేలు పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, టీ ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ఎం సంజయ్ కుమార్ పార్టీలు ఫిరాయించారని కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంలో రిట్ పిటిషన్(సివిల్) వేశారు.ఆ తర్వాత వాదనలు జరుగుతుండగానే మార్చి 18న బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. దానం నాగేందర్‌ని ప్రతివాదిగా చేర్చారు. ఈ అన్నీ పిటిషన్లపై గతంలో సీజేఐ ధర్మాసనం విచారణ జరిపి గత జులై 31 వరకు ఫిరాయింపులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించారు. అయితేడ స్పీకర్ కార్యాలయం ఈ మూడు నెలల కాలం ముగించే సమయానికి.. మరింత గడువు కావాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇదే సందర్భంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై కోర్టు ధిక్కార పిటిషన్‌తో పాటు, మరో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే పాడి కౌశిక్ రెడ్డి, ఇతరులు మిస్ లీనియస్ అప్లికేషన్లు వేశారు. ఈ పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ ద్విసభ్య ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. స్పీకర్ కార్యాలయం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, పిటిషనర్లు కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, ఇతరుల తరపున ఏఓఆర్ మోహిత్ రావు హాజరయ్యారు.తొలుత స్పీకర్ తరపున సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. మొత్తం పది అనర్హత పిటిషన్లలో ఎనిమిదింటిని స్పీకర్ పరిష్కరించారని కోర్టుకు నివేదించారు. గత విచారణ తరువాత జరిగిన పురోగతిని ధర్మాసనానికి నివేదించారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కొంత సమయం అడిగారని తెలిపారు. అందువల్ల మిగిలిన రెండు పిటిషన్ల పరిష్కారానికి మరో మూడు వారాల సమయం కావాలని కోరారు. మార్చి నెల మధ్యలోగా మిగిలిన వాటిపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని కోర్టుకు వివరించారు.స్పీకర్ తరపు అభ్యర్థనపై పిటిషనర్ల తరపు న్యాయవాది మోహిత్ రావు అభ్యంతరం తెలిపారు. ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 16 నెలలుగా ఈ కేసు నడుస్తోందని, ఉద్దేశపూర్వకంగానే విచారణలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. 'ఒక ఎమ్మెల్యే గెలిచిన ఆరు నెలలకే పార్టీ ఫిరాయించి, కాంగ్రెస్ గుర్తుపై ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. పార్టీ ఫిరాయించిన మరో ఎమ్మెల్యే కుమార్తె కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేస్తే సంబంధిత ఎమ్మెల్యే ప్రచారం చేశారని ఉద్వేగంగా వాదనలు వినిపించారు. వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకునేలా చూడాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు.ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం, గత ఆదేశాల ప్రకారం కేసులో పురోగతిని స్పీకర్ కార్యాలయం తెలిపిందన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని మరో మూడు వారాలు సమయం ఇస్తున్నట్టు జస్టిస్ సంజయ్ కరోల్ వెల్లడించారు. అప్పటికీ స్పీకర్ కార్యాలయం నిర్ణయం తీసుకోకపోతే, కోర్టు ధిక్కరణ చర్యలపై ఆలోచన చేస్తామని ధర్మాసనం పేర్కొంది. మరోవైపు కోర్టులో జరిగిన వాదనలను సోషల్ మీడియాలో పలువురు న్యాయ వాదులు, ఇతరులు వైరల్ చేస్తోన్న అంశంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటివి చేయొద్దని వ్యాఖ్యానించింది.

# విశ్వవిజేత భారత్...

(మొదటి పేజీ తరువాయి)

తొలుత బ్యాటింగ్‌లో పరుగుల సునామీ సృష్టించి, ఆపై బౌలింగ్‌లో అద్భుతంగా రాణించి ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేసింది.భారత్ నిర్దేశించిన 412 పరుగుల భారీ లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. బెన్ డాకిన్స్ (66), బెన్ మేయస్ (45) వేగంగా పరుగులు సాధించారు. అయితే, భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టారు. ఒక దశలో 177 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. ఈ సమయంలో కాలెబ్ ఫల్కనర్ (67 బంతుల్లో 115) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 9 ఫోర్లు, 7 సిక్సర్లతో అద్భుత శతకం బాది ఒంటరి పోరాటం చేశాడు. అతనికి జేమ్స్ మింటో (28) నుంచి కొంత సహకారం లభించినా, అది గెలుపునకు సరిపోలేదు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ఇంగ్లండ్ పోరాటం 40.2 ఓవర్లలో 311 పరుగుల వద్ద ముగిసింది. భారత బౌలర్లలో ఆర్ఎస్ అంబ్రీష్ 3 వికెట్లతో సత్తా చాటగా, కనిష్క్ చౌహాన్, దీపేష్ దేవేంద్రన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 భారీ సిక్సర్లతో ఏకంగా 175 పరుగులు చేసి ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతని ఇన్నింగ్స్‌తో భారత్ భారీ స్కోరుకు బలమైన పునాది పడింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53) బాధ్యతాయుతమైన అర్ధశతకంతో రాణించగా, వేదాంత్ త్రివేది (32), విహాన్ మల్హోత్రా (30), వికెట్ కీపర్ అభిగ్యాన్ కుండు (40) విలువైన పరుగులు జోడించారు. చివర్లో కనిష్క్ చౌహాన్ (20 బంతుల్లో 37 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో జేమ్స్ మింటో 3 వికెట్లు తీశాడు.భారత్ గతంలో 2000, 2008, 2012, 2018, 2022లో అండర్–19 కప్ ను గెలిచింది. ఇప్పుడు రికార్డు స్థాయిలో ఆరోసారి కప్ సాధించి, అండర్–19 ప్రపంచకప్ చరిత్రలో తన తిరుగులేని ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. మ్యాచ్ అనంతరం భారత ఆటగాళ్లు త్రివర్ణ పతాకాలను చేతబూని మైదానంలో సంబరాలు జరుపుకున్నారు.

# రుణ గ్రహీతలకు ఊరట..

ఢిల్లీఫిబ్రవరి6(జర్నలిస్ట్ వార్త):

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. పాలసీ రెపో రేటును ప్రస్తుతమున్న 5.25 శాతం వద్దే కొనసాగించాలని ద్రవ్య పరపతి కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. దీంతో పాటు తమ 'న్యూట్రల్ మానిటరీ పాలసీ' వైఖరికే కట్టుబడి ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు.

దేశ ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ అంచనాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ తెలిపారు. గత డిసెంబర్ సమావేశం తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రతికూలతలు పెరిగినప్పటికీ, ప్రభుత్వం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు ఆర్థిక వ్యవస్థకు సానుకూలంగా ఉన్నాయని ఆయన అన్నారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే, వృద్ధికి ఆటంకం కలగకుండా సమతౌల్యం పాటించడమే 'న్యూట్రల్' వైఖరి ఉద్దేశమని వివరించారు.

ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని, ఆర్బీఐ నిర్దేశించిన సహన పరిమితి కంటే తక్కువగా ఉందని మల్హోత్రా పేర్కొన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాలకు సీపీఐ ద్రవ్యోల్బణ అంచనాలను వరుసగా 4 శాతం, 4.2 శాతానికి సవరించినట్లు తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలు ఆశాజనకంగా ఉన్నాయని, దేశీయ అంశాలే దీనికి కారణమని ఆయన అభిప్రాయపడ్డారు.గత డిసెంబర్‌లో జరిగిన సమీక్షలో వృద్ధిని ప్రోత్సహించేందుకు ఆర్బీఐ రెపో రేటును 5.5 శాతం నుంచి 5.25 శాతానికి (25 బేసిస్ పాయింట్లు) తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆగస్టు, అక్టోబర్‌లలో రేట్లను స్థిరంగా ఉంచింది. ప్రస్తుతం రేట్లలో మార్పు లేనందున గృహ, వాహన రుణాలతో సహా ఇతర రుణాలపై వడ్డీ రేట్లు ఇప్పట్లో పెరిగే అవకాశం లేదు.

# స్తంభించిన పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభ, రాజ్యసభ ఎలాంటి ముఖ్యమైన చర్చలు జరపకుండానే సోమవారం వరకు వాయిదా పడ్డాయి. అమెరికా ప్రయోజనాలకు పూర్తిగా లొంగిపోవడం, వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేయడం, భారత్–చైనా ఉద్రిక్తత సమయంలో కీలకమైన నిర్ణయాలను ఆలస్యం చేయడం వంటి ఆరోపణలను మోడీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ప్రధానంగా చేశాయి. శుక్రవారం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే, ప్రతిపక్షాలు తీవ్ర నిరసనలు తెలిపాయి. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన వివాదాస్పద పుస్తకం 'ఫర్ ది స్టార్స్ ఆఫ్ డెస్టినీ' చిత్రాలతో కూడిన బ్యానర్‌లను పట్టుకుని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. 'నియంతృత్వాన్ని అనుమతించరు', 'ప్రతిపక్షాలను మాట్లాడటానికి అనుమతించాలి', 'నరేంద్ర లొంగిపోయారు' వంటి నినాదాలు సభలో హోరెత్తాయి.దీని తరువాత, సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు కూడా ప్రతిపక్షాల నిరసనలు తగ్గలేదు. పోస్టర్లు, ప్లకార్డులు, బ్యానర్ల నినాదాలు కొనసాగాయి. ప్రధాని లోక్‌సభను ఎదుర్కోవడానికి భయపడుతున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ఈ సమావేశంలో 19 గంటల 13 నిమిషాలు నిరంతర నిరసనలతో సమయం వృథా అయ్యిందని స్పీకర్ ఆరోపించారు. అయితే, ప్రతిపక్షాల డిమాండ్లను ఆమోదించే వరకు బడ్జెట్ చర్చలకు తాము ఏ విధంగానూ సహకరించబోమని, తమ వైఖరిలో మార్పు లేదని ప్రతిపక్షం స్పష్టం చేసింది. అనంతరం సభను సోమవారం వరకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. రాజ్యసభలో కూడా ఇలాంటి నిరసనలే జరిగాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనలు పార్లమెంటు వెలుపలా కొనసాగాయి. 'ఎటువంటి ఒప్పందం అనుమతించబడదు' అనే బ్యానర్‌తో ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ గేటు వద్ద నిరసన తెలియజేశారు. సస్పెండైన ఎంపీలు కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో

# రెండు పార్టీలకూ బుద్ధి చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజల్ని మోసం చేస్తోందని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీనీ సరిగా అమలు చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బాండ్ పేపర్‌పై రాసి ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తానన్న హామీని గుర్తు చేస్తూ.. ఆ బాండ్ పేపర్‌ను సభలో ప్రజల ముందు ప్రదర్శించారు. నాలుగు సార్లు ఓడిపోయానని, ఈసారి ఓటు వేయకపోతే చనిపోతానని సానుభూతి డైలాగులతో ప్రజలను మభ్యపెట్టిన ఆది శ్రీనివాస్.. ఆ తర్వాత అభివృద్ధి గురించి పట్టించుకోలేదని విమర్శించారు.వేములవాడ నియోజకవర్గానికి ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇన్ని మోసాలు, ద్రోహాల తర్వాత కూడా ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, ప్రజలు తమ మోసాలను ఆమోదించినట్టేనని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. అలా జరిగితే భవిష్యత్‌లో హామీల అమలుపై దృష్టి పెట్టే అవకాశమే ఉండదన్నారు. రూ.4 వేల పెన్షన్, ఆసరా పెన్షన్, రైతు భరోసా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, తులం బంగారం వంటి హామీలు అమలు కావాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే తమ మోసాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్న విషయం ప్రభుత్వానికి అర్థమవుతుందని చెప్పారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా తెలంగాణకు చేసింది ఏమీ లేదని కేటీఆర్ విమర్శించారు.ఇదే పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన కేంద్ర మంత్రి బండి సంజరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతి ఇంటికీ రూ.15 లక్షలు ఇస్తానన్న ప్రధాని మోడీ హామీ ఏమైందని నిలదీశారు. ఎన్నికలొచ్చినప్పుడల్లా దేవుడి పేరు, కులం, మతం పేరుతో ప్రజలతో ఓట్లు వేయించుకోవడమే బీజేపీ పని అని ఆరోపించారు. బీజేపీ దొంగ మాటలను నమ్మొద్దని, పేదల కడుపులు నింపి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌ను గుర్తు పెట్టుకొని బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో వేసే ప్రతి ఓటూ మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసే ప్రస్థానానికి తొలి అడుగుగా మారాలని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ అభ్యర్థులు నిమ్మచెట్టి విజయ్, గోలి మహేష్, మారం కుమార్, నరాల శేఖర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ మేనిఫెస్టో విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌ఛార్జిలు అశోక్ పర్ణామి, రేఖాశర్మతో కలిసి వికసిత తెలంగాణ.. భాజపా సంకల్ప పత్రం పేరుతో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రామచందర్ రావు విడుదల చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు భాజపాను చూసి భయపడుతున్నాయని అని రామచందర్ రావు అన్నారు. కేంద్రం.. తెలంగాణకు ఏం ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రానికి ఏం ఇచ్చిందో.. జిల్లాల వారీగా చెబుతామని, రేవంత్ రెడ్డి జిల్లాలకు ఏం ఇచ్చారో చెప్పగలరా అని సవాల్ విసిరారు. పోలీసులు భాజపా కార్యకర్తలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం, మంచిర్యాలలో పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులు చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పోలీసులను కార్యకర్తల్లా ఉపయోగించుకుంటుందని దుయ్యబట్టారు. పోలీసులు బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలో భాజపా సర్కార్ ఉన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. పన్నుల పెంపు లేదు, వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, బస్తీ దవాఖానలు, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి, క్లీన్ సిటీ, గ్రీన్ టౌన్. 100 శాతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ , దేవాలయాల రక్షణ, మహిళల రక్షణ. మున్సిపాలిటీల్లో దోమలు, పందులు, కుక్కలు, కోతుల బెడద నివారణ. సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి కోసం బీజేపీ మేనిఫెస్టో అంటూ రూపకల్పన తొలిసారి తెలంగాణలో అన్ని మున్సిపల్ వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ మెజారిటీ స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేయాలని పార్టీ పట్టుదలతో ఉంది. 60 శాతానికి పైగా మున్సిపాలిటీలు, కనీసం 5 కార్పొరేషన్లను దక్కించుకోవాలని టార్గె÷ట్ పెట్టుకుంది. ఇందుకోసం స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కష్టపడుతున్నారు. బీజేపీ యువ మోర్చాకు ఈ ఎన్నికల్లో ప్రత్యేక టాస్క్ ఇచ్చారు. జెన్–జీ టార్గెట్‌గా ప్రచారంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశర చేశారు..

# మనకెందుకులే అనుకోవద్దు...

## ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది: పవన్ కల్యాణ్



విజయవాడ,ఫిబ్రవరి6(జర్నలిస్ట్ వార్త):

ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుందని, హిందూ దేవుళ్లను, ధర్మాన్ని కించపరిచినప్పుడు మౌనంగా ఉండకుండా తమ గళాన్ని వినిపించాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సగటు హిందువు మనస్తత్వంలో మార్పు రావాలని, భయంతో లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి, కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలను వివరిస్తూ, "మనం కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా విభజనకు గురై ఉండవచ్చు. కానీ మనందరి ధర్మం ఒక్కటే, దేవుళ్లు కూడా అంతే. మన విశ్వాసాలను, ధర్మాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు మన బాధను తెలియజేయడం మనందరి కర్తవ్యం. ఇలాంటి కీలక సమయాల్లో పాటించే మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ కేవలం భక్తులుగా మిగిలిపోకుండా, తమ విశ్వాసాలకు స్పృహతో కూడిన సంరక్షకులుగా కూడా వ్యవహరించాలని ఆయన కోరారు.

హిందూ ధర్మాన్ని రక్షించుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలను, సంప్రదాయాలను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, తమ విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మం యొక్క గౌరవాన్ని కాపాడుకోగలమని ఆయన ట్వీట్ చేశారు.

# 10వ వార్డు అభివృద్ధి కోసమే నా లక్ష్యం

## కుట్టు మిషన్ గుర్తు పై ఓటు వేసి అత్యాధిక మెజార్టీ తో గెలిపించాలి

### మహర్షి- కంజర్ల మహేష్



**వర్ధన్నపేట/ఫిబ్రవరి4(జర్నలిస్ట్ వార్త )** 10వ వార్డు అభివృద్ధి కోసమే నా లక్ష్యం అని కుట్టు మిషన్ గుర్తు పై ఓటు వేసి అత్యాధిక మెజార్టీ తో గెలిపించెలని మహర్షి- కంజర్ల మహేష్ అన్నారు. శు క్రవారం వర్ధన్నపేట 10వ వార్డు స్వతంత్ర అభ్యర్థి కంజర్ల మహా శ్రీ మహేష్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి జెండా మోసిన కార్యకర్తలను విస్మరించడం స్థానిక నాయకత్వ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. జైలు శిక్షలు అనుభవించి పార్టీని బలోపేతం చేస్తే, నేడు పారాచూట్ నేతలకు ప్రాధాన్యత ఇవ్వడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నా పోరు కేసీఆర్ పై కాదు, స్థానికంగా సాగుతున్న రాక్షస పాలనపైనే అని ఆయన స్పష్టం చేశారు. అధినేత సిద్ధాంతాలే తన శ్వాస అని చెపారు, అన్యాయానికి వ్యతిరేకంగానే కుట్టు మిషన్ గుర్తు తో బరిలోకి దిగానని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజలే తనకు హైకమాండ్ అని, తన విజయాన్ని కేసీఆర్ కి కానుకగా అందిస్తానని ధీమా వ్యక్తం చేశారు. వార్డులో అవినీతిని కత్తిరించి, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని మహేష్ వాగ్దానం చేశారు. ఒక సీనియర్ కార్యకర్తగా తనకు న్యాయం చేయాలని వార్డు ప్రజలను ప్రాధేయపడ్డారు. కుట్టు మిషన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి, ప్రజా సేవలో భాగస్వాములను చేయాలని ఆయన కోరారు.

# గర్భిణీలకు దంత ఆరోగ్యంపై అవగాహన



**వర్ధన్నపేట/ఫిబ్రవరి 6(జర్నలిస్ట్ వార్త);**గర్భిణీ స్త్రీలు తమ శారీరక ఆరోగ్యంతో పాటు నోటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వైద్య నిపుణులు సూచించారు. వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో గర్భిణీలకు నిర్వహించిన 'నోటి ఆరోగ్య పరిరక్షణ' అవగాహన శిబిరంలో దంత వైద్యులు డా. భరత్ రెడ్డి, డా. అపర్ణ మాట్లాడుతూ గర్భిణీలు నోటి పరిశుభ్రత పాటించకపోతే చిగుళ్ల సమస్యల వల్ల తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం, నెలలు నిండకముందే ప్రసవం జరిగే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారు. గర్భిణీలు ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా దంత పరీక్ష చేయించుకోవాలని. అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైతే గైనకాలజిస్ట్ సలహాతోనే చేస్తారని తెలిపారు.స్త్రీల వైద్య నిపుణులు డా. పూర్ణిమ మాట్లాడుతూ గర్భధారణ సమయంలో హార్మోన్ల మార్పుల వల్ల చిగుళ్ల వాపు, రక్తం కారడం వంటి సమస్యలు సహజమని, వీటికి భయపడకుండా సరైన చికిత్స తీసుకోవాలని పేర్కొన్నారు.

# ధర్మసాగర్ రిజర్వాయర్‌లో రొయ్య పిల్లల విడుదల



**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 6: (జర్నలిస్ట్ వార్త);**ధర్మసాగర్ గ్రామంలోని రిజర్వాయర్‌లో శు క్రవారం మత్స్య సంపద అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని రొయ్య పిల్లలను ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతిఏలియా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మత్స్య అభివృద్ధి శాఖాధికారి శ్రీపతి మాట్లాడుతూ, రిజర్వాయర్‌లో రొయ్య పిల్లల విడుదలతో మత్స్య సంపద గణనీయంగా పెరుగుతుందని, తద్వారా గ్రామంలోని మత్స్యకారులకు స్థిర ఆదాయం లభిస్తుందని తెలిపారు. మత్స్య సంపద పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో క్షేత్ర స్థాయి అధికారి భవాని మాట్లాడుతూ, శాస్త్రీయ పద్ధతుల్లో చేపలు, రొయ్యల పెంపకం చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షులు మెడబోయిన సుధాకర్ , ఉపాధ్యక్షులు ముప్పారపు అశోక్ , కార్యదర్శి రాయిళ్ళ శేఖర్ , సంఘు నిర్వాహకులు, కుల పెద్దలు, సంఘు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యువజన నాయకులు ప్రజా ప్రతినిధులుగా ఎదగడం గర్వకారణం

### వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య




**రాయపర్తి/ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త):**యువజన నాయకులు ప్రజా ప్రతినిధులుగా ఎదగడం సమాజానికి గర్వకారణమని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డా. కడియం కావ్య అన్నారు. హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని యూత్ హాస్టల్‌లో నిర్వహించిన అంతర రాష్ట్ర యువజన సమ్మేళనంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇటీవల సర్పంచ్‌గా ఎన్నికైన రాయపర్తి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కందికట్ల స్వప్న సంతోష్‌ను డా. కడియం కావ్య మెమోంటో అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. యువత ప్రజాసేవలో ముందుకు రావడం ద్వారా గ్రామాలు, రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతాయని ఆమె పేర్కొన్నారు. యువ నాయకత్వం సమాజానికి సరికొత్త దిశానిర్దేశం చేస్తుందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ఆర్కియాలజీ ఇంజనీర్ కృష్ణ చైతన్య, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, మేర యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపెల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థి దేవేందర్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

### మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు





**వర్ధన్నపేట/ఫిబ్రవరి6(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ అభ్యర్థి దేవేందర్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు.శుక్రవారంవర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు డి.సి. తండా లో మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థి మాలోతు దేవేందర్ నాయక్ విజయానికి కృషి చేయాలని ఓటర్లను కోరారు.దేవేందర్ నాయక్ గెలుపుతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు తండా వాసులు పాల్గొన్నారు.



# నాలుగు కార్మిక కోడ్‌ల రద్దుకు సిద్ధం కావాలి

### : భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర సమావేశం




**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త):**హైదరాబాద్ ఏఎస్‌రావు నగర్ గ్రంథాలయ భవనంలో భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం రాష్ట్ర సమావేశాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ, కార్మికులంతా ఏకమై తమ హక్కులను సాధించుకోవాలని, అవసరమైతే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు.సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ మాట్లాడుతూ, భవన నిర్మాణ రంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకురావడం సిగ్గుచేటని పేర్కొన్నారు.కార్మికుల పరిహార చట్టం2019, పారిశ్రామిక సంబంధాల చట్టం2020, సామాజిక భద్రతా చట్టం2020, వృత్తి భద్రతఆరోగ్యంపని ప్రదేశ పరిస్థితుల చట్టం2020లను అమల్లోకి తీసుకువచ్చి, కార్మికుల శ్రమశక్తిని కార్పొరేట్ సంస్థలకు చౌకగా అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.కొత్త కార్మిక కోడ్‌ల వల్ల కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు, న్యాయమైన సమస్య పరిష్కారానికి సమ్మె చేసే హక్కు దెబ్బతింటుందని తెలిపారు. గతంలో ఎనిమిది గంటలు పని చేసిన కార్మికులను ఇప్పుడు పన్నెండు గంటలు పనిచేయాల్సిన పరిస్థితికి తీసుకువస్తున్నారని అన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనమని విమర్శించారు.నాలుగు కార్మిక కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేసి, మళ్లీ 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే కార్మికులను సంఘటితం చేసి ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు.
ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి కార్మిక నాయకులు, కార్మిక ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదర్శ దంపతులు నిమ్మాని విజయ,శేఖర్ రావు లు

### భూ దానం, గో దానం చేయడం అభినందనియం ఎమ్మెల్యే నాగరాజు







**వర్ధన్నపేట/ఫిబ్రవరి6(జర్నలిస్ట్ వార్త):**
ఆదర్శ దంపతులు నిమ్మాని విజయ,శేఖర్ రావులని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు.ఆధ్యాత్మిక చింతనతో పాటు సామాజిక బాధ్యతను చాటుకుంటున్న నిమ్మాని విజయ,శేఖర్ రావు దంపతులు సమాజానికి ఆదర్శంగా నిలిచారని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వారిని కొనియాడారు. శు క్రవారం శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిమ్మాని దంపతులు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీ భూ సమేత గోవింద పెరుమాళ్ళ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చేసిన భూ దానం, గో దానం పట్ల ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేక హర్షం వ్యక్తం చేశారు.సమాజ శ్రేయస్సు కోరి అడుగులు వేస్తున్న విజయ,శేఖర్ రావు దంపతులకు ఎమ్మెల్యే తన హృదయపూర్వక అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని, కల్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించారు.



# వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో అంచనాలు తారుమారు

**ప్రతి పక్ష పార్టీ నాడి పట్టిన అదికార పార్టీ**

**మొదట్లో అంత బి ఆర్ ఎస్ అనుకున్న క్రమక్రమేణ కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పెరుగుతుంది.**

**ఇలానే కంటిన్యు చేస్తే చైర్మెన్ పాఠం కాంగ్రెస్ పార్టీ దే**



**వర్ధన్నపేట/ఫిబ్రవరి6(జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మున్సిపాలిటీలో ప్రచార పర్వం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో ఓటరు నాడి అనూహ్యంగా మారుతుండటం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మొదట్లో బీఆర్ఎస్ ఏకపక్షంగా గెలుస్తుందని భావించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇప్పుడు పూర్తిగా తారుమారవుతున్నట్లు కనిపిస్తోంది.

**వ్యూహాల్లో మార్పు,పెరిగిన కాంగ్రెస్ బలం**

ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ గత కొన్ని రోజులుగా తన ప్రచార శైలిని మార్చి, దూకుడు పెంచింది. విపక్షాల బలహీనతలను పసిగట్టడంలో కాంగ్రెస్ వ్యూహకర్తలు సఫలమయ్యారు. స్థానిక సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీలు ఇస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో కాంగ్రెస్ గ్రాఫ్ క్రమక్రమంగా పెరుగుతోంది. మార్పు కావాలి,అభివృద్ధి సాధ్యం కావాలి అనే నినాదం పట్టణ ఓటర్లలో బలంగా వినిపిస్తోంది. ఒకప్పుడు బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న వర్ధన్నపేటలో ఇప్పుడు అధికార పార్టీ నేతలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ వంటి బలమైన నేతలు మళ్లీ పార్టీలోకి చేరినప్పటికీ, ద్వితీయ శ్రేణి నాయకత్వంలో నెలకొన్న అసంతృప్తి పార్టీకి మైనస్‌గా మారుతోంది. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థులు ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతుండటం, పట్టణ ఓటర్లు బహిరంగంగానే కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం చర్చనీయాంశంగా మారింది. వార్డుల వారీగా విశ్లేషిస్తే, యువత, మహిళా ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు క్షేత్రస్థాయి తెలుస్తుంది. నిరుద్యోగ సమస్యలు, స్థానిక మౌలిక సదుపాయాల కొరత వంటి అంశాలను కాంగ్రెస్ అస్త్రాలుగా మలుచుకుంది. ఇదే ఉత్సాహాన్ని పోలింగ్ రోజు వరకు కొనసాగించగలిగితే, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు.ప్రచారంలో దూకుడు చూస్తుంటే, చైర్మన్ పీఠం దక్కించుకునే దిశగా కాంగ్రెస్ అడుగులు వేగంగా పడుతున్నాయని స్పష్టమవుతోంది.

# అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మంబ్యూరో/ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త):** సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 202628 సంవత్సరాల కాలానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 28తో ముగియనున్న నేపథ్యంలో అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ సంస్థలకు చెందిన జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారిని పరిశీలించి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

# బిఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

## .మాజీ ఎమ్మెల్యే సతీమణి ఫాతిమా మేరీ



**స్టేషన్ ఘన్ పూర్/ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని13వవార్డు లో కాంగ్రెస్ అభ్యర్థి మారేపల్లి ప్రసాద్ బాబు కారు గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటా ప్రచారంనిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజ య్య సతీమణి ఫాతిమా మేరీ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో జరిగిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. యువ నాయకుడు మారేపల్లి ప్రసాద్ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజా ర్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీ, ఆకారపు అశోక్, చింత శ్రీనివాస్, తదిత రులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి



**వైరా/ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త):** వైరా మున్సిపాలిటీలోని 1, 2, 20 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ వార్డు కౌన్సిలర్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ పార్టీ అభ్యర్థులను గెలిపించి ప్రజా సంక్షేమానికి అంకితమైన పాలనకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని వారు తెలిపారు. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని పేర్కొంటూ, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పూర్తి స్థాయిలో మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు స్థాయి నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**రాయపర్తి/ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్):** రాయపర్తి మండలంలోని పాణ్య నాయక్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు భూక్యా లక్‌పతి కుటుంబాన్ని శుక్రవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబానికి రూ. 2,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసర సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గజవెల్లి ప్రసాద్, ఐత రాంచందర్, సంకినేని ఎల్లస్వామి, మాజీ సర్పంచ్ వెంకట్రాం, మాజీ ఎంపీటీసీ భూక్యా క్రాంతి, భూక్యా సంతోష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అసంపూర్తి పనులకు శ్రీకారం చుట్టిన సర్పంచ్

**రాయపర్తి/ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండలంలోని జేతురాం తండ గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన గ్రామ పంచాయితీ కార్యాలయ భవన నిర్మాణ పనులకు శుక్రవారం సర్పంచ్ గుగులోత్ స్వప్నవిజయ్ నాయక్ శ్రీకారం చుట్టారు. కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను పునఃప్రారంభించారు.



ఈ సందర్భంగా సర్పంచ్ స్వప్నవిజయ్ నాయక్ మాట్లాడుతూ, గ్రామ పంచాయితీ భవనం గ్రామాభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో గుత్తేదారు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, పనులను సకాలంలో పూర్తి చేసి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. గ్రామ పంచాయితీ భవనం పూర్తయితే గ్రామ పరిపాలన మరింత సక్రమంగా సాగుతుందని, ప్రజలకు అవసరమైన సేవలు వేగవంతమవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోత్ రవి, మాజీ సర్పంచ్ కిషన్‌తో పాటు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అక్రమ రిజిస్ట్రేషన్లు?




**హనుమకొండ/ఫిబ్రవరి6(జర్నలిస్ట్ వార్త);** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లతో అడ్డగోలుగా డబ్బులు చేతులు మారుతున్నాయనే ఆరోపణలున్నాయి. డబ్బులు ఇస్తే చాలు ప్రాపర్టీ లేకున్నా రిజిస్ట్రేషన్లు, కూల్చివేసిన ఇండ్లకు రిజిస్ట్రేషన్ పత్రాల సృష్టి, తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు సమాచారం. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద తిరిగే కొందరు బ్రోకర్లను ఆశ్రయిస్తున్నారు. సదరు బ్రోకర్లు తప్పుడు డాక్యుమెంట్లు పెట్టి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సదరు డాక్యుమెంట్లు తనఖా పెట్టి కొందరు పలు ఫైనాన్స్ కంపెనీలలో లోన్లు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదంతా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తెలిసే జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి.

:పూర్తి వివరాలు, ఆధారాలతో మరో వార్త కథనం త్వరలో..

# భీమదేవరపల్లి మండలంలో 15వ విడత సామాజిక తనిఖీలు




**భీమదేవరపల్లి/ఫిబ్రవరి6 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల పరిధిలోని గ్రామ పంచాయితీలలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి 15వ విడత సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడివో వీరేశం తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో 2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చి 31 వరకు జరిగిన పనులకు ఈ సామాజిక తనిఖీలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గ్రామస్థాయిలో తనిఖీలు పూర్తయిన అనంతరం, సామాజిక తనిఖీ ప్రజావేదికను 2026 ఫిబ్రవరి 13వ తేదీ ఉదయం 10.00 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడివో కోరారు.

# నిమ్మకూరులో ప్రమాణస్వీకార మహోత్సవానికి హాజరైన టీడీపీ నేతలు

**ఖమ్మం/ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్):** కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలో నిర్వహించిన ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమానికి జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరయ్యారు. కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షులుగా నియమితులైన వీరంకి వెంకట గురుమూర్తి ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమంలో నందమూరి రామకృష్ణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్మకూరు గ్రామంలో ఉన్న పార్టీ వ్యవస్థాపకుడు, తెలుగు జాతి ఆత్మగౌరవ పతాక నందమూరి తారక రామారావు (ఎన్‌టీఆర్) గృహాన్ని వారు సందర్శించారు. ఎన్‌టీఆర్ గృహాన్ని సందర్శించడం ద్వారా పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను మరింత బలోపేతం చేయాలని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనమా వాసు, కొనకంచి సురేష్, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, నున్నా నవీన్ చౌదరి తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ధర్మసాగర్ అభివృద్ధికి ఐక్యతే మార్గం: బొడ్డు దయాకర్

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గానికి ఘన సన్మానం





**ధర్మసాగర్/హనుమకొండ, బ్యూరో ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త);** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా తో పాటు గ్రామ పాలకవర్గ సభ్యులకు శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతి సాగర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూలమాలలు, శాలువాలతో పాలకవర్గాన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ రాజకీయ విభాగ సభ్యులు బొడ్డు దయాకర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధర్మసాగర్ గ్రామాన్ని కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా ఉంచుతూ సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితం కావాలని, అనంతరం గ్రామ సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా గ్రామ పాలకవర్గం, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మార్పీఎస్ సంస్థ పూర్తి స్థాయిలో సహకరిస్తుందని భరోసా ఇచ్చిన ఆయన, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగను కలిసి ధర్మసాగర్ గ్రామానికి అవసరమైన నిధులు ప్రభుత్వంలోని మంత్రుల ద్వారా తీసుకువచ్చేలా ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఇందుకు గ్రామ పాలకవర్గం సమన్వయంతో ముందుకు రావాలని కోరారు. ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేస్తూ, కుల, మత, రాజకీయ విభేదాలను పక్కనబెట్టి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ధర్మసాగర్‌ను అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సమిష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు శాంతి సాగర్ మాదిగ, బొడ్డు దయాకర్ మాదిగ, బోర్ర బిక్షపతి మాదిగ, కుమ్మరి రాజన్న మాదిగ, గంగారపు శ్రీనివాస్ మాదిగ, సోంపేల్లి అన్వేష్ మాదిగ, చిలక రాజు మాదిగ, కొట్టే శంకర్ మాదిగలతో పాటు నిమ్మ సుదర్శన్ రెడ్డి, బొడ్డు ప్రదీప్ కుమార్, కూనూరు రాజు, రొండి రాజు, కొలిపాక రమేష్, బొడ్డు రమణాకర్, బొడ్డు ప్రభుదాస్ (చిన్న), బొడ్డు సురేష్, బొడ్డు ప్రభుదేవ, బొడ్డు వంశీ, నక్క సిద్దు, బొడ్డు క్రాంతి రణదేవ్, పుట్ట ప్రదీప్, బన్నీ, రజనీకాంత్, అక్షయ్, జాలిగాపు శ్యామ్, యోహాన్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ పాలకవర్గం తరపున సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, మొదటి వార్డు సభ్యులు మ్యాక సాంబరాజు, రెండో వార్డు సభ్యులు మల్కి రెడ్డి మమత, మూడో వార్డు సభ్యులు ఎం.డి. ముజ్జు, ఐదో వార్డు సభ్యులు నక్క పౌల్, ఆరవ వార్డు సభ్యులు చిలుక ప్రతిభ, ఏడో వార్డు సభ్యులు జనగాని సుమన్, ఎనిమిదో వార్డు సభ్యులు జాలిగాపు లావణ్య, తొమ్మిదో వార్డు సభ్యులు బెల్లం ప్రేమ్ కుమార్, పదమూడో వార్డు సభ్యులు గంగారపు శ్యామ్, పద్నాలుగో వార్డు సభ్యులు బొడ్డు రఘు ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గుర్రం రామయ్య భౌతిక కాయానికి నివాళులర్పించిన సింగిల్ విండో చైర్మన్.



**బయ్యారం/ఫిబ్రవరి 6(జర్నలిస్ట్ వార్త);** మండల కేంద్రంలోని కాకతీయ నగర్ కాలనీకి చెందిన గుర్రం రామయ్య అనారోగ్యంతో గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న బయ్యారం సొసైటీ మాజీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి ఇంటికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు కుంజ విజయ, తమ్మిశెట్టి వెంకటపతి, వజ్జ సమతా, పోతుగంటి సుమన్, నాశ బోయిన గణేష్, కొల్లా హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కారు గుర్తుకు ఓటేయాలి: మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

**నర్సంపేట/ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట మున్సిపల్ ఎన్నికల్లో 9వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాయడి కీర్తి దుశాంత్‌రెడ్డి, 10వ వార్డు అభ్యర్థి నాగిశెట్టి పద్మా ప్రసాద్‌లను గెలిపించాలని మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజలను కోరారు. గురువారం కారు గుర్తుకు ఓటు వేయాలంటూ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటమి భయంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలను బెదిరింపులకు గురి చేస్తూ రౌడీయిజం, గుండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికలు సవ్యంగా జరిగితే ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తారని భయపడి అరాచకాలు, అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

ఈ వార్డులో రూ.7 కోట్ల వ్యయంతో సెంట్రల్ ఏసీ



సౌకర్యాలతో ఆడిటోరియం నిర్మించినప్పటికీ ఇప్పటివరకు దాన్ని ప్రారంభించలేదని తెలిపారు. అలాగే 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర డైరెక్టర్,



జడ్పీ మాజీ వైస్ చైర్మన్, నియోజకవర్గ కోఆర్డినేటర్, జిల్లా నాయకులు, మాజీ ఎంపీపీ, చెన్నారావుపేట మండల పార్టీ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, ఎన్నికల ఇన్‌చార్జీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, క్లస్టర్ బాధ్యులు, మండల మరియు పట్టణ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కల్లూరులో కాంగ్రెస్‌కు క్లీన్ స్వీప్ ఖాయం

**కళ్యాణపు వెంకటేశ్వరరావు, జిల్లెల్ల స్వాతి విజయం కాయం మండల నేతలు**



**కల్లూరు/ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త):**కల్లూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం ఖాయమని మండల కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. 1వ వార్డు కౌన్సిలర్‌గా బరిలో ఉన్న కప్పలబంధం గ్రామానికి చెందిన జిల్లెల్ల స్వాతి, 9వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కళ్యాణపు వెంకటేశ్వరరావులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు.వైరా ఏఎంసీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, తల్లాడ మాజీ సర్పంచ్ వేమిరెడ్డి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పొట్టేటి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూడ 1వ, 9వ వార్డులకు ఇన్‌చార్జులుగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆయా వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో ఓటర్లు అనుకూలంగా స్పందిస్తున్నారని అన్నారు. రాజకీయ అనుభవజ్ఞులైన నేతల నాయకత్వంలో సాగుతున్న ప్రచారం ప్రజలను ఆకట్టుకుంటోందని పేర్కొన్నారు.తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ కాంగ్రెస్ అభ్యర్థులను ఘన విజయం వైపు నడిపిస్తామని మండల నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

# దాతలను ఘనంగా సత్కరించిన పాఠశాల ఉపాధ్యాయులు

**తల్లాడ/ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త):**తల్లాడ మండల పరిధిలోని మల్లారం గ్రామ ప్రాథమిక పాఠశాలలో డోనర్స్ గ్రాటిట్యూడ్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిబాబు అధ్యక్షత వహించారు.కార్యక్రమానికి మండల ఎంపీడీవో శ్రీధర్ రాజు, గ. సురేష్‌బాబు, నెమ్మికంటి దామోదర ప్రసాద్‌లు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మల్లారం గ్రామ సర్పంచ్ కటికి కిరణ్‌కుమార్, తల్లాడ ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి అవసరమైన సదుపాయాలు అందించిన దాతలను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో అతిథులు మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధితో పాటు సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ



తమవంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.అదే విధంగా గ్రామంలోని దాతలను గౌరవించి సత్కరించిన పాఠశాల ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ



ఉప సర్పంచ్ ఎర్రి నరసింహారావు, మరో మాజీ ఉప సర్పంచ్, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర రావు, ఎస్.కే. హుస్సేన్, కుప్పాల నరసింహారావు, ధనకొండ ఉపేందర్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల తనిఖీ చేసిన ఏటీడిఓ భాస్కర్ రావు.



**బయ్యారం/ ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండలం ఇర్సులాపురంఆశ్రమ పాఠశాలను ఏటీడిఓ అకస్మికంగా తనిఖీ చేశారు.ఆశ్రమ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏటీడిఓ భాస్కర్ రావు అన్నారు.పాఠశాలలో రిజిస్టర్లు,తరగతి గదులు,భోజనంలో నాణ్యత,పరిసరాలను పరిశీలించారు.విద్యార్థులతో



మాట్లాడారు.ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతి రోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించి,ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.పదో తరగతి విద్యార్థులకు వంద శాతం ఉత్తీర్ణత పొందే విదంగా చూడాలని ఉపాధ్యాయులకి ఆదేశించారు.రోజు వారిగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలిస్తూ,ప్రతి విద్యార్థికి చదవడం,రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు, వార్డెన్ లాలయ్య, పీడీ వాలు టీచింగ్ స్టాఫ్ సంబంధిత అధికారులు ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి

**. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

**స్టేషన్ ఘన్ పూర్/ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త):**
స్టేషన్ ఘనపూర్‌కు మున్సిపాలిటీ రావడంతో అభివృద్ధి మహర్దశ ప్రారంభమైందని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకొని మరింత అభివృద్ధి చెందాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని వార్డులలో, స్టేషన్ఘన్పూర్ లోని స్టేషన్ ఘన్పూర్ లోని14వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, పెసరు కృష్ణవేణి, 15వవార్డు కౌన్సిలర్ అభ్యర్థి బొల్లు లక్ష్మి ఎన్నికల ప్రచారంలోభాగంగావరంగల్ ఎంపీడాక్టర్ కడియం కావ్య ఇంటింటికి విస్తృత ప్రచారంనిర్వహించారు. ప్రజల గడప గడపకు వెళ్లి వారిసమస్యలను అడి గి తెలుసుకుంటూ, ప్రతి కుటుంబాన్ని ఆప్యాయం గాపలకరిస్తూ ప్రచారాన్నిఉత్సాహంగా కొనసాగిం చారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వరంగల్ ఎంపీ



డాక్టర్ కడియం కావ్య మాట్లాడు తూ స్టేషన్ ఘనపూర్‌కు మున్సిపాలిటీ రావడం తో అభివృద్ధి మహర్దశ ప్రారంభ మైందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజ లందరిపై ఉంద ని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎన్నికైన తరువాతనే స్టేషన్ ఘనపూర్‌కు మున్సిపాలిటీ సాధ్యమైందని గుర్తుచేశారు.మున్ని పాలిటీ ఏర్ప డిన వెంటనే 50కోట్ల నిధులుతీసుకొచ్చి అభివృద్ధి పనులు



ప్రారంభించారనితెలిపారు.50 కోట్ల నిధు లు అవినీతిపరుల చేతుల్లోఉండాలా,లేక అభివృ ద్ధిచేసే నాయకులచేతుల్లో ఉండాలా అనేది ప్రజలే నిర్ణయించుకోవాలని అన్నారు. గత పదేళ్ల పాలన లో బీఆర్ఎస్ ప్రభుత్వం స్టేషన్ ఘనపూర్ పట్టణ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శిం చారు. వార్డు అబ్జర్వర్లు ఇన్చార్జిలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నా రు.

# మున్సిపాలిటీ ఎన్నికల వేళ 'గులాబీ' జోరు

## : వర్ధన్నపేటలో ఇంటింటి ప్రచారంలో ఎర్రబెల్లి,









**వర్ధన్నపేట/ఫిబ్రవరి /ఫిబ్రవరి 6 (జర్నలిస్ట్ వార్త):**
మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వర్ధన్నపేట నియోజకవ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ నేడు విస్తృతంగా పర్యటించారు.

**అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రచారం**

మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అభ్యర్థులతో కలిసి వారు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అడిగారు చేస్తున్నారని చేస్తున్నారని చేసిన లేక 7వ వార్డు: తిరుపతి సురేష్

8వ వార్డు: బానోతు శ్రీనివాస్

12వ వార్డు: గుండె స్వప్నిక - రవి

వీరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ, కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు ప్రచారంలో భాగంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అరూరి రమేష్ గారు కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ, వార్డుల్లోని స్థానిక సమస్యల పరిష్కారానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజలు ఈ ప్రచారానికి భారీగా తరలివచ్చి అభ్యర్థులకు బ్రహ్మరథం పట్టారు



